సాక్షి వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. - 8లో



రాజ్యాంగ పరిరక్షణ కోసం యాత్ర

రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర చేపడుతున్నట్లు కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /23.0

జిల్లాలో సోమవారం 23.0 - 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

కేజీబీవీ పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలి

– కేజీబీవీల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు



సమావేశంలో మాట్లాడుతున్న కేజీబీవీల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు

కడప ఎడ్యుకేషన్ : కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కేజీబీవీల రాష్ట్ర డిప్యూటి డైరెక్టర్ దేవరాజులు సూచించారు. కడపలోని యుటీఎఫ్ కార్యాలయంలో సోమవారం వంట మనుషులకు, వాచ్ ఉమెన్‌లకు, ఏఎన్ఎంలకు, అటెండర్లకు, స్వీపర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా దేవరాజులు మాట్లాడుతూ కేజీబీవీ పిల్లలకు వడ్డించే ఆహారం నాణ్యతలో ఎక్కడా తేడా రాకూడదన్నారు. వంటమనుషులు అన్ని జాగ్రత్తలు పాటించి భోజనాలను వండాలన్నారు. అలాగే అటెండర్లు, స్వీపర్లు ఎప్పటికప్పుడు శుభ్రతను పాటించాలన్నారు. సమగ్ర శిక్ష అడిషన్ కో–ఆర్డినేటర్ నిత్యానందరాజులు మాట్లాడారు. జీసీడీఓ దార్ల రూతు ఆరోగ్య మేరీ కేజీబీవీల సిబ్బంది విధి విధానాలను వివరించారు. అనంతరం ఉపాధ్యాయుడు దేవదత్తం డెమో చేసి వివరించారు. సెక్టోరియల్ అధికారులు సంజీవరెడ్డి, ఆఫీసు సిబ్బంది మాధవి, అనూష, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్ : జిల్లాలో విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 30వ తేది సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం లెక్కించగా రూ.60,785 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.శ్రీధర్‌లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆగస్టు 13 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను గ్రామస్తుల సమక్షంలో లెక్కించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది చంద్ర, వంతాటిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తు గడువు పెంపు

మదనపల్లె సిటీ : ఓపెన్ స్కూల్ ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి గడువును అక్టోబర్ 31వతేదీ వరకు పెంచినట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో అవకాశం కల్పించారన్నారు. 14 సంవత్సరాలు వయస్సు నిండిన వారు పదోతరగతిలో, అలాగే 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందొచ్చన్నారు. వివరాలకు 8121 852786 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పల్లె వైద్యం.. పరిస్థితి దైన్యం!



- పీహెచ్‌సీ వైద్యుల సమ్మె బాట
- వైద్యం అందక పల్లె ప్రజల అవస్థలు
- ఇతర ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్న వైనం

పల్లె వైద్యం కుంటుపడింది. సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీల వైద్యులు సమ్మెబాట పట్టడంతో పీహెచ్‌సీలలో వైద్యం దయనీయంగా మారింది. జ్వరాలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం కరువైంది. పరిస్థితులు చేయిదాటి కొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తుంటే.. చేతిలో డబ్బులాడని కొందరు నర్సులు ఇచ్చే మందులు తీసుకుని వెనుదిరుగుతున్నారు.



దువ్వూరు పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ



జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ పీహెచ్‌సీ డీఏ సభ్యులు

కడప రూరల్ : పీహెచ్‌సీ వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ గతేడాది సెప్టెంబర్‌లో ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారుల చర్చల్లో భాగంగా హామీలు ఇవ్వడంతో అప్పట్లో సమ్మెను బహిష్కరించారు. ఏడాదైనా ఆ హామీలు అమలు కానందున తిరిగి ఈ నెల 26 నుంచి ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అందులో భాగంగా సోమవారం ఓపీ సేవలను బహిష్కరించారు. అత్యవసర కేసులను మాత్రం చూశారు. మంగళవారం నుంచి విధులను పూర్తిగా బహిష్కరించి కడప కలెక్టరేట్ వద్ద మౌన దీక్షలు ఇతర కార్యక్రమాల ద్వారా తమ నిరసనను తెలపనున్నారు.

నర్సుల వైద్యం కొంత మేరకే ఫలితం...

జిల్లాలో మొత్తం 51 పీహెచ్‌సీలు ఉన్నాయి. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు నర్సులతో పాటు మిగతా సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వైద్యులు సమ్మె బాట పట్టడంతో పేషెంట్స్‌ను చూసే బాధ్యత నర్సులపై పడింది. వారు సాధారణ నొప్పులు, జ్వరాలకు మందులు ఇవ్వగలరు. కొన్ని వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ నివేదిక ద్వారా మందులను ఇవ్వాల్సి ఉంటుంది. ప్రధానంగా సరిపడే యాంటిబయాటిక్ మందులను సూచించాలి. ఈ పనులను నర్సులు చేయలేరు. అలాగని ఏదో ఒక మందును ఇవ్వలేరు. దీంతో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. ఇప్పటికే బంద్ కారణంగా వైద్యుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. చింతకొమ్మదిన్నె పీహెచ్‌సీలో మాత్రం ట్రైనీ వైద్యులు అందుబాటులో ఉన్నారు. మిగతా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేకపోవడంతో నర్సులే వైద్య సేవలు అందిస్తున్నారు. డాక్టర్లు లేరని తెలుసుకున్న స్థానికులు వైద్యం కోసం పట్టణాలకు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. మరికొందరు సమీపంలోని ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ వైద్యం పడకేయడంతో పల్లె వాసులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించాలి..వైద్యుల సమ్మె త్వరగా ముగియాలని గ్రామీణులు వేడుకుంటున్నారు.

జాయింట్ కలెక్టర్ వినతి...

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్ర, కార్యదర్శి మొహమ్మద్ తాహ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ వినయ్, వైద్యులు ఆరిఫుల్లా, రోషిణి, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె!

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఫలితంగా బాధితులు పదేపదే వస్తున్నారు. కాగా సోమవారం జేసీ అదితిసింగ్ అర్జీదారుల సమస్యలను ఆలకించారు. వాటి పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల్లో కొన్ని..– కడప సెవెన్‌రోడ్స్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ

భూమి కాజేసేందుకు టీడీపీ నేత ఒత్తిడి



మా మామ పాలెం సుబ్బనరసింహులు పేరిట సర్వే నెంబరు 6/2బిలో 5.35 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని తనకు విక్రయించాలంటూ రెండేళ్లుగా మా గ్రామానికి చెందిన అధికార టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ఒత్తిడి చేస్తున్నారు. మమ్మల్ని సాగు చేసుకోనివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ఆయనపై చర్యలు తీసుకుని మా భూమి మాకు దక్కేలా చర్యలు తీసుకోవాలి. –నరసింహారావు, దవంతరంపల్లె, ఒంటిమిట్ట మండలం

మోసంతో స్థల విక్రయం



నేను బయనబోయిన నాగమల్లేశ్వరి నుంచి రెండు సెంట్ల 566 చదరపు లింకుల గునాదిగల స్థలాన్ని రూ. 8 లక్షలకు కొనుగోలు చేశాను. రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఇప్పుడు ఎ.వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి వచ్చి బుల్‌డోజర్‌తో గునాది ధ్వంసం చేశాడు. ఈ విషయాన్ని నేను నాగమల్లేశ్వరి దృష్టికి తీసుకెళ్లినా ఆమె సమాధానం ఇవ్వడం లేదు. ఈ విషయంపై సీకే దిన్నె పోలీసులు తహసీల్దార్ నివేదికను కోరారు. తహసీల్దార్ స్పందించడం లేదు. నాకు న్యాయం చేయాలని కోరేందుకు వచ్చాను. – షేక్ కలీమున్నీసా, సీకే దిన్నె

ఉల్లి రైతులకు పరిహారం చెల్లించాలి



కర్నూలు జిల్లా మాదిరే అధిక వర్షాలకు నష్టపోయిన జిల్లాలోని ఉల్లి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 50 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. అధికారులు ఈ జిల్లా రైతులకు ఈ సాయం అందదని అంటున్నారు. దీనిపై స్పందించి రైతులకు వివరణ ఇవ్వాలి. దెబ్బతిన్న ఖరీఫ్ పంటలకు బీమా, ప్రభుత్వం ద్వారా పరిహారం ఇప్పించాలని కోరుతున్నాం.– ఆదినారాయణ రెడ్డి,మల్లారెడ్డి, జనార్దన్‌రెడ్డి, బీకేఎస్ నాయకులు

చీనీ చెట్లు నరికేశారు



మా తోటలోని వంద చీనీ చెట్లను మా గ్రామానికి చెందిన అన్నవరం గోపాల్ రెడ్డి అనే వ్యక్తి నరికివేశారు. గ్రామ సర్వే నెంబరు 220/2బీ1, 2బీ2లలో మా అబ్బ కొండప్ప పేరిట 5.48 ఎకరాల భూమి ఉంది. ఇందుకు సంబంధించి ఈసీ, ఆర్ఎస్ఆర్, పాసుపుస్తకాలన్నీ ఉన్నాయి. మా భూమి పక్కనున్న గోపాల్‌రెడ్డి మా భూమిని కాజేయాలన్న కుట్రతో చీనీ చెట్లు నరికించి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు.
– రాము, గురిజాల గ్రామం, సింహాద్రిపురం

కూటమిని నమ్మి మోసపోయాం!



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : కూటమి ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామంటూ సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జోరు వర్షంలో తడుస్తూ నిరసన గళం విప్పారు. సచివాలయాలలో పనిచేసే ఉద్యోగులు ఆలస్యంగానైనా కూటమి ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరును ఎండగట్టారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. జేఏసీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సిద్దేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇంతకుముందు 50 ఇళ్లకు ఓ వలంటీర్ ఉండేవారని తెలిపారు. ఒక సచివాలయంలో 25 క్లస్టర్లు ఉంటాయన్నారు. వలంటీర్లు చేసే పని ఇప్పుడు తమపై పడుతోందన్నారు. డ్యూయల్ బాసిజం తమపై ఎక్కువైందని తెలిపారు. అన్నిరకాల పనులు సచివాలయ సిబ్బందితో చేయిస్తుండడం దారుణమన్నారు. అలాగే పదోన్నతులు కల్పించేందుకు తగిన విధి విధానాలు రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హీరామియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.మస్తాన్ తదితరులు మాట్లాడుతూ ప్రతిసారి సర్వేల పేరుతో ఇంటింటికి తిరిగి విధులు నిర్వర్తించడం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురవుతున్నామన్నారు. విద్యార్హత ఆధారంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులను అప్పగించాలన్నారు. ఉద్యోగంలో ప్రమోషన్లు ఇవ్వాలని.. జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయం గెలిచింది

- ఎంపీ మిథున్‌కు బెయిల్‌పై సంబరాలు
- కూటమి అక్రమ అరెస్టులకు భయపడమంటూ నినాదాలు



మదనపల్లె : పార్టీ కార్యాలయం వద్ద నిసార్, పార్టీ శ్రేణుల సంబరాలు

మదనపల్లె : రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని జూలై 19న కూటమి ప్రభుత్వం మద్యం అక్రమ కేసులో అరెస్టు చేసింది. 72 రోజులపాటు నిర్బంధించింది. బెయిల్ రాకుండా కుట్రలు, కుతంత్రాలు చేసింది. బెయిల్ కోసం న్యాయస్థానం ముందు పిటిషన్ వేస్తే.. అడ్డుకునేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ పిటిషన్ వేసింది. అరెస్ట్ అయిన రెండు నెలల తర్వాత సిట్ కస్టడి కోరడం, దాని వెనక ఉద్దేశం ఇట్టే అర్థమవుతుంది. అక్రమ అరెస్ట్ నుంచి.. ఎన్నో వేధింపులు, ఇబ్బందులకు గురి చేసినా చివరకు న్యాయమే గెలిచింది. సోమవారం విజయవాడ ఏసీబీ కోర్టు మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. తమ నేతను అక్రమ కేసులో నిర్బంధించి, వేధించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్ మంజూరు వార్త బయటకు రాగానే జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్దిరెడ్డి కుటుంబ అభిమానులు, అనుచరులు, వైఎస్సార్‌సీపీప నేతలు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. మిథున్ రెడ్డి బ్యానర్లు చేతబట్టి.. జై జగన్, జై మిథున్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి, కక్షగట్టి వేధిస్తున్న చంద్రబాబుకు అధికార పతనం తప్పదు అంటూ హెచ్చరించారు.

అంతిమ విజయం న్యాయానిదే



రాజకీయంగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఎదుర్కోలేక కుట్రపూరితంగానే కూటమి సర్కార్ అక్రమ మద్యం కేసు పెట్టింది. మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావడం మంచి పరిణామం. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పెడుతున్న అక్రమ కేసులు ఎన్నో రోజులు నిలవవు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నీ ప్రజలు గమనిస్తూ ఉన్నారు. తగిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుద్ధిచెబుతారు. ఎవరెన్ని తప్పుడు కేసులు పెట్టినా అంతిమ విజయం న్యాయానిదే.
– గడికోట శ్రీకాంత్‌రెడ్డి,
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కోర్టు తీర్పు కూటమి సర్కార్‌కు చెంపపెట్టు



గత ఎన్నికల సమయంలో రాజంపేట పార్లమెంట్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబాన్ని ఎదుర్కోలేక కూటమి సర్కార్ మద్యం అక్రమ కేసు పెట్టింది. అక్రమ మద్యం కేసులో ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ఏసీబీ కోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిది. ఇప్పటికైనా కూటమి పాలకులు బుద్ధి తెచ్చుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడాలి.
– ఆర్ రమేష్‌కుమార్ రెడ్డి,
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

సాక్ష్యాలు లేని కేసు



రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై పెట్టిన మద్యం అక్రమ కేసు ముమ్మాటికీ తప్పుడు కేసే.సాక్ష్యాలు లేకుండా అరెస్ట్ చేశారని మిథున్ రెడ్డి చెప్పడం అక్షరాలా నిజమైంది. వైఎస్సార్‌సీపీని బలహీనపర్చాలన్న టీడీపీ కుట్రలు సాగవు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి చావుదెబ్బ తప్పదు. అక్రమ కేసులకు భయపడేదే లేదు.
– నిసార్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ,
మదనపల్లె సమన్వయకర్త

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నిరసనను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం పిలుపు మేరకు ఈనెల 30వ తేది నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న దళితులు జయప్రదం చేయాలని ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అమరావతిలోని డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, పార్కును ప్రైవేటుకు అప్పగించడం వంటి వాటిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల అధికంగా నష్టపోయేది దళితులేనన్నారు. నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధ, మాజీ మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొంటారని పేర్కొన్నారు.ఉదయం 9.30 గంటలకల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శులు బాబు, త్యాగరాజు, సుబ్బరాయుడు, నేతలు వినోద్ కుమార్, కంచుపాటి బాబు, జాషువా, పి. సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం!



కడప విజయదుర్గా ఆలయంలో భక్తుల సందడి



కడప అమ్మవారిశాలలో వాసవాంబను దర్శించుకుంటున్న భక్తులు



కడప అమ్మవారిశాలలో సరస్వతీ మాతగా అమ్మవారు

దేవీ నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం అన్ని ప్రధాన ఆలయాల్లోనూ అమ్మవారు సరస్వతీ దేవీగా దర్శనమిచ్చారు. 'అమ్మా! సరస్వతీ మాతా.. మా పిల్లలు చదువుల్లో మంచి ప్రతిభ చూపేలా మనసారా దీవించు తల్లీ' అంటూ భక్తులు ప్రణమిల్లారు. ఉత్సవాలలో భాగంగా జిల్లాలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం 6 గంటల నుంచి భక్తులు ఆలయాల బాట పట్టారు.
– కడప సెవెన్‌రోడ్స్/ ప్రొద్దుటూరు కల్చరల్



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో సరస్వతీ దేవి అలంకారం

క్లుప్తంగా

విలేకరితోపాటు ముగ్గురిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో ఓ విలేకరితో పాటు ముగ్గురు యువకులపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దసరా ఉత్సవాల సందర్భంగా పాతమార్కెట్‌లోని చెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో రామప్రసాద్ అనే కానిస్టేబుల్ 27న రాత్రి విధులు నిర్వహిస్తున్నాడు. అయితే నలుగురు యువకులు కేకలు వేస్తూ బైక్‌లపై అక్కడికి వచ్చారు. ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని చెప్పినందుకు కానిస్టేబుల్‌ను యువకులు తోశారు. దీంతో తన విధులకు కలిగించేలా నలుగురు యువకులు వ్యవహరించారని కానిస్టేబుల్ ఫిర్యాదు చేశాడు. వారి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. వారిలో ఓ విలేకరి కూడా ఉండటం గమనార్హం.

జనసంఘం నాయకుడిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వాధికారి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు కాలర్ పట్టుకొని బెదిరించినందుకు గాను జనసంఘం నాయకుడు పెద్దిరాజుపై ప్రొద్దుటూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమైంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపల్లె కాల్వపై అక్రమ కట్టడాలను నిర్మించారని, వాటిపై చర్యలు తీసుకోవాలని జనసంఘం నాయకుడు పెద్దిరాజు కొన్ని రోజుల క్రితం కలెక్టర్‌కు అర్జీ పెట్టాడు. ఈ క్రమంలో ఈఓఆర్డీ, కొత్తపల్లె పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరి రామాంజనేయరెడ్డి ఈ నెల 25న భోజనం చేసేందుకు శివాలయం వీధిలోని స్వప్న బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అదే సమయంలో అక్కడే ఉన్న పెద్దిరాజు తన పిటిషన్‌పై చర్యలు తీసుకోకుండా.. ఎందుకు క్లోజ్ చేశావంటూ రామాంజనేయరెడ్డి కాలర్ పట్టుకొని బెదిరించాడు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ తనపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచన మేరకు సోమవారం టూ టౌన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెద్దిరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.వెంకటాపురం గ్రామానికి చెందిన సువర్ణ (28) పాము కాటుకు గురై సోమవారం మృతి చెందింది. ఆమెకు 4 సంవత్సరాలలోపు పిల్లలు ముగ్గురు ఉన్నారు. వివరాలలోకి వెళితే.. శనివారం సాయంత్రం పశువుల మేత కోసం పొలం వద్దకు వెళ్లి పొలం గట్టున గడ్డి కోస్తుండగా.. ఆమె చేతికి ఏదో కరచినట్లు అనిపించింది. బాధితురాలిని వెంటనే కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పాము కాటుకు గురయినట్లు వైద్యులు తెలిపారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు తెలపడంతో తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో పశ్చిమబెంగాల్ వాసి మృతి

లక్కిరెడ్డిపల్లె : విద్యుత్ లైన్‌లకు మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై పశ్చిమబెంగాల్‌కు చెందిన పూర్వబర్ధమాన్ జిల్లా రామగోపాల్‌పూర్‌కు చెందిన సంజయ్ బాగ్దీ (32) అనే యువకుడు మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని కాకుళవరం గ్రామం ఎస్సీ కాలనీలో ఒక లైన్‌మెన్‌కు సహాయకుడిగా ఆర్డీఎస్ఎస్ కింద పని చేస్తున్న సంజయ్ బాగ్దీ ఆదివారం రాత్రి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సోమవారం మృతుడి బంధువులకు అప్పగించినట్లు సమాచారం.

‘కళ’తప్పిన జీవితం

- చెక్క భజన కళాకారుడికి కష్టాలు
- వింత వ్యాధితో మంచానికే పరిమితం
- అప్పు చేసి చికిత్స పొందుతున్న వైనం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

కడప ఎడ్యుకేషన్ : ఎందరినో కళాకారులుగా తీర్చిదిద్దిన చెక్కభజన కళాకారుడికి.. నేడు కష్టాలొచ్చాయి. కదలలేని స్థితిలో మంచానికే పరిమితమై ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. వచ్చిన జబ్బును నయం చేయించుకునేందుకు ఉన్న డబ్బంతా అయిపోగా.. నేడు దాతల, ప్రభుత్వం సహకారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాడు. రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జి ల్లాలలో.. ఎన్నో చెక్క భజన, కోలాటం కార్యక్రమా లు నిర్వహించారు. ఎందరినో చెక్క భజన, కోలాటం (కులుకుభజన) కళాకారులుగా తీర్చిదిద్దారు. దీంతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మో త్సవాలు, దసరా ఉత్సవాలు, గోదావరి పుష్కరాలు.. ఇలా ప్రత్యేక రోజుల్లో చెక్కభజన, కోలాటాలు నిర్వహించి భక్తుల మన్ననలు పొందారు. ఈ రెండు కళల నిర్వహణతో జిల్లాలో ఎందరినో శిష్యులను తయారు చేశారు. వారిలో కొందరిని గురువులుగా తీర్చిదిద్దారు. ఆయన పట్ల ప్రభుత్వం, దాతలు, శిష్యులు స్పందించి జబ్బును నయం చేయిస్తే.. భవిష్యత్తులో మరింతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుంది.

ఓ మారుమూల గ్రామంలో..

వైఎస్ఆర్ కడప జిల్లా కాశినాయన మండలం మారుమూల ప్రాంతానికి చెందిన నాయనపల్లి గ్రామంలో మున్నెల్లి గురవయ్య, బాల చెన్నమ్మ దంపతుల మూడో సంతానం మునెల్లి ఓబులేసు. ఈయన చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకొని మేకలు, గొర్రెలు మేపడానికి వెళ్తూ అడవిలో పాటలు పాడుతూ.. 14 ఏళ్ల వయసులోనే చెక్కభజనపై మక్కువ పెంచుకుని భజన నేర్చుకున్నాడు. ఆ తరువాత వరికుంట్ల గ్రామంలో ఒక గురువు దగ్గర పూర్తి స్థాయిలో చెక్క భజన నేర్చుకోవడం జరిగింది. గాన కోకిల, చెక్కభజన, కోలాట కళాకారుడిగా పేరు పొందారు. అప్పట్లో తాను పాట పాడితే కోకిలమ్మ గానం చేసినట్లే ఉండటంతోపాటు, నాట్యం చేస్తే నెమలి నాట్యం చేసినట్లు ఉంటుందని అందరి ప్రశంసలు పొందాడు. అలా ఈయన పూర్తి స్థాయిలో భజన కళాకారుడైన తర్వాత కడప జిల్లాతోపాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరుతోపాటు పలు జిల్లాలలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంతో మంది చెక్కభజన కళాకారులకు భజన నేర్పించారు. దీంతోపాటు ఎంతో మందిని చెక్క భజన గురువులను, శిష్యులను తయారు చేశారు. ఈయన కళకు మెచ్చి ఎన్నో అవార్డులు అందజేశారు. ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. మాజీ మంత్రి, దివంగత నేత బిజివేముల వీరారెడ్డి చేతుల మీదుగా కూడా అవార్డు తీసుకోవడం జరిగింది.



చెక్కభజన కళాకారుడు మెన్నెల్లి ఓబులేసు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓబులేసు

మూడేళ్లుగా వింత జబ్బుతో..

గత మూడేళ్ల నుంచి మునెల్లి ఓబులేసు వింతైన వ్యాధితో బాధపడుతున్నాడు. బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో కాళ్ల లోలోపలే కుళ్లిపోయి నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. జబ్బు నయం చేయించుకునేందుకు దాదాపుగా రూ.14 లక్షల వరకు ఖర్చు పెట్టుకున్నాడు. మళ్లీ ఇటీవల రెండు నెలల నుంచి ఆరోగ్యం సరిగా లేక రేణిగుంటలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో.. అప్పు చేసి చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వైద్య ఖర్చులు కూడా పెట్టుకునే స్థితి లేక అప్పులు చేసుకుని దాతల ఆపన్న హస్తం తోపాటు ప్రభుత్వం సాయం కోసం ఎదురు చేస్తున్నాడు. తనను దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

వైఎస్ఆర్‌సీపీ హయాంలోనే బుగ్గవంక బ్రిడ్జిలకు నిధులు

- అప్పటి సీఎం వైఎస్ జగన్ రూ.20 కోట్లు మంజూరు
- కాంట్రాక్టర్ తండ్రి చనిపోవడంతో పనులు ఆలస్యం
- టీడీపీ జీవోలు మార్చి శిలాఫలకాలు వేసుకోవడం సిగ్గుచేటు
- మీడియాతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే బుగ్గవంకపై షామీరియా మసీదు, లా కాలేజీల వద్ద బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎస్ఎండీ షఫీ, అజ్మతుల్లా అన్నారు. సోమవారం మాజీ డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, సుబ్బరాయుడు, శ్రీరంజన్‌రెడ్డి, డిష్ జిలాన్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2001లో బుగ్గవంకకు వచ్చిన వరదల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ ఘటనకు చలించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తాను 2004లో అధికారంలోకి రాగానే రూ.70 కోట్లతో బుగ్గవంక రక్షణగోడ, సుందరీకరణ పనులు చేపట్టారన్నారు. వైఎస్ హయాంలోనే 80 శాతానికిపైగా పనులు అయిపోయాయని, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పెండింగ్ పనుల గురించి పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.72 కోట్లు మంజూరు చేసి బుగ్గవంక రక్షణ గోడ పూర్తి చేయడంతోపాటు గోడ వెంట అప్రోచ్ రోడ్లు, కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని, 2023లో లాకాలేజీ, షామీరియా మసీదు వద్ద బ్రిడ్జిల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేయగా టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. కాంట్రాక్టర్ తండ్రి చనిపోవడంతో పనులు ఆలస్యం అయ్యాయని, ఈలోపు ఎన్నికలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవి అవే నిధులకు జీవోలు మార్చి తీసుకొచ్చారని, తాము మంజూరు చేయించిన రూ.20 కోట్ల కంటే ఒక్క రూపాయి అదనంగా తేలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌లోనే వైఎస్ఆర్‌సీపీ హయాంలో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఆ బ్రిడ్జిలు పూర్తి చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే మాధవి 16 నెలల తర్వాత మళ్లీ పనులు ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంజూరు చేసిన నిధులను మేమే తెచ్చామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవి చెప్పుకొంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. తమ శిలాఫలకాలను తొలగించి మీ పేర్లతో కొత్తవి వేసుకున్నంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదన్నారు. దమ్ముంటే ప్రభుత్వంతో నగరాభివృద్ధికి నిధులు తెచ్చి శిలాఫలకాలు వేసుకుంటే ప్రజలు హర్షిస్తారన్నారు. తమ ప్రభుత్వంలో పనులు రద్దు చేశారని చెప్పడం శుద్ధ అబద్ధమన్నారు. అసత్యాలతో ప్రజలను ఎంతో కాలం మభ్యపెట్టలేరన్నారు. బుగ్గవంకపై బ్రిడ్జిలకు నిధులు సాధించిన ఘనత కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకే దక్కుతుందన్నారు. టీడీపీ నేతలు శిలాఫలకాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరని హెచ్చరించారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప అర్బన్ : వైఎస్ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 149 ఫిర్యాదులు (పీజీఆర్ఎస్)కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచిఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి విచ్చేసిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకే జిల్లా ఎస్పీ వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

ఎస్పీ పేర్కొన్న ముఖ్య అంశాలు

- పోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం.
- ప్రజల నుంచి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తాం.
- ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన)కె. ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

10 నుంచి క్యారమ్స్ పోటీలు

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు అక్టోబర్ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానికంగా వారు సోమవారం వివరాలు వెల్లడించారు. పోటీలో పాల్గొనదలచినవారు అక్టోబర్ 5వ తేదీ లోపల డబుల్స్ రూ.500, సింగిల్స్ రూ.300 చెల్లించి తమ ఎంట్రీలు పంపాలని తెలిపారు. క్యారమ్స్ పోటీలు (స్ట్రైట్ గేమ్)లో ఉంటాయని తెలియజేశారు. ఎంట్రీలను బిఎన్ శంకర్ ప్రెసిడెంట్, యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్, నందలూరు అన్నమయ్య జిల్లా వారికి పంపాలని తెలిపారు. ఎంట్రీల కోసం 7732054403, 9908095211, 9866015602, 7989392971 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ పోటీలలో డబుల్స్ విన్నర్స్‌కు రూ.40 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు, సింగిల్స్ విన్నర్స్‌కు రూ.25 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలతోపాటు మరిన్ని బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వివరించారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

గాలివీడు : పట్టణంలో గుట్టుగా సాగుతున్న గంజాయి బ్యాచ్‌పై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ తన సిబ్బందితో కలసి సోమవారం ఉదయం గాలివీడు పట్టణంలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయమై సీఐని వివరణ కోరగా గత కొన్ని రోజులుగా రెక్కీ నిర్వహించిన అనంతరం పక్కా సమాచారంతో చిలకలూరిపేట వద్ద గుడిసెల్లో నివాసం వుంటూ గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని ఫోన్ ద్వారా గంజాయి క్రయవిక్రయాలు సాగిస్తున్న మరో ఇద్దరు యువకులు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ముగ్గురిని అదుపులోకి తీసుకుని లక్కిరెడ్డిపల్లెకు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అయితే గాలివీడులో గంజాయి మత్తులో యువత పెడదారి పడుతున్న విషయంపై గతంలో తల్లిదండ్రులు ఆరోపించినా, పత్రికల్లో కథనాలు వెలువడినా స్థానిక యంత్రాంగం పెడచెవిన పెట్టడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి మూలాలను సమూలంగా కూకటివేళ్లతో పెకలించి వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసు మాటలపై మంటలు

- తెలుగుదేశం పార్టీ అంటే ‘రెడ్డెప్పగారి’ సొత్తా..!
- జెండా మోయని, ఓట్లేయని వారికి పదవులు ఇచ్చారు
- పైగా సీనియర్లను ‘తోలు.. తొక్క’ అంటూ అవమానించారు
- సీనియర్ నేత కొండా సుబ్బయ్య ధ్వజం
- టీడీపీ వాట్సాప్ గ్రూప్‌లలో హల్‌చల్

కడప రూరల్ : జిల్లా తెలుగుదేశం పార్టీ ఎటు పోతోందో తెలియని గందరగోళం నెలకొంది. ఆధిపత్య పోరుకు అంతులేకుండా పోయింది. నేతలు.. కార్యకర్తల మధ్య ‘పచ్చ’ గడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇక కడప నియోజకవర్గంలో అయితే నిత్యం అగ్నిగుండంలా తమ్ముళ్ల ఆగ్రహావేశాలు లావాలా ఎగిసిపడుతున్నాయి. తాజాగా అందుకు సాక్షాత్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసులురెడ్డి కారణం అయ్యారు. ఇటీవల ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు శ్రీనివాసులురెడ్డి కాస్త ఘాటుగా సమాధానం ఇచ్చారు. ‘సీనియర్లు లేదు.. తోలు తొక్క లేదు.. ఒకే పార్టీ తెలుగుదేశం పార్టీ.. ఎంఎల్ఏ, రెడ్డెప్పగారి కుటుంబం మాత్రమే నాయకత్వం.. ఇదీ తెలుగుదేశం పార్టీ.. సీనియర్లు లేదు.. తోలు తొక్కలేదు’ అంటూ వ్యాఖ్యానించారు. ఆయన మాటలు పార్టీలోని సీనియర్లలో ఆగ్రహం నింపాయి. చిన్నా, పెద్దా లేకుండా, సీనియర్లు, జూనియర్లు అనే బేధం లేకుండా.. అలా మాట్లాడడంపై సర్వత్రా ఆ పార్టీలోని కార్యకర్తలో అసంతృప్తి నెలకొంది. ఈ వ్యాఖ్యలపై పెద్ద దుమారమే రేపిందని చెప్పవచ్చు. తెలుగుదేశం పార్టీ అంటే ‘రెడ్డెప్పగారి సొత్తా’ అని తమ్ముళ్లు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కొండా సుబ్బయ్య స్పందించారు. ‘పార్టీ అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసులురెడ్డి ఒక వ్యక్తి గురించి చెప్పకుండా, సీనియర్లు లేరు.. తోలు తొక్క లేదని వ్యాఖ్యానించడం తగదు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి అంటే ప్రజాప్రతినిధి, ఆమె పెత్తనం ఉండడంలో తప్పులేదు. తెలుగుదేశం పార్టీ అంటే ‘రెడ్డెప్పగారి కుటుంబం’ అన్నారు. జిల్లా అధ్యక్షులుగా మీతోపాటే రమేష్‌రెడ్డి, అలాగే ఒక డాక్టర్ ఉన్నారు. ఇదేనా తెలుగుదేశం పార్టీ అంటే. ఇదేం భాష. ఏనాడూ జెండాలు మోయని వారికి, ఎప్పుడూ ఓట్లేయని వారికి పదవులు ఇచ్చావు. ఎక్కడి నుంచో వచ్చిన వాళ్లు మాపై పెత్తనం చెలాయించాలని చూస్తున్నారు. ఇది పద్ధతి కాదు. పార్టీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి పేరు వచ్చేలా చూడాలి’ అంటూ వ్యాఖ్యానించారు. ఈ మాటల వీడియో టీడీపీ వాట్సాప్ గ్రూప్‌లో హల్‌చల్ చేస్తోంది.

రాజ్యాంగ పరిరక్షణ కోసం యాత్ర

కేంద్ర మాజీ ఎంపీ చింతామోహన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర చేపడుతున్నట్లు కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. కుప్పం నుంచి మొదలైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సోమవారం కడపకు చేరుకుంది. మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమై అంబేడ్కర్ విగ్రహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసి ఉన్న దళితులను విభజించి పరిపాలించడం తగదన్నారు. వర్గీకరణ అనేది చెల్లదని, అది భారత రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ విభజనకు ప్రధాన కారణం చంద్రబాబు అన్నారు. దళిత వర్గాలను మాల మాదిగలుగా విభజించిన కారణంగా మాదిగలు తెలంగాణను కోరుకున్నారన్నారు. బ్రిటీషర్ల మాదిరిగా చంద్రబాబు దళితులను విభజించి పాలించాలనుకుంటున్నాడని, అది ఎప్పటికీ జరగదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్

మోదీ, బాబు పాలనపై ధ్వజం

కడప రూరల్ : ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ తీవ్ర స్థాయిలో ధ్వజ మెత్తారు. కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.

బాధితురాలికి ఐఫోన్ అప్పగింత

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన బయనబోయిన కిరణ్ కుమారి ఈ నెల 28న బట్టలు కొనుగోలు చేయుటకు ఇంటి నుంచి షాపింగ్ మాల్ వెళుతుండగా, బ్రహ్మయ్య షెడ్ వద్ద తనకు చెందిన సుమారు రూ.80,000 విలువ గల ఐఫోన్ మొబైల్ పోగొట్టుకున్నది. ఈ విషయాన్ని ఆమె వెంటనే చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేసినది. ఈ క్రమంలో ఆర్టీసీ కాలనీకి చెందిన ముత్యాలపాడు శ్రీరాములుకు బ్రహ్మయ్య షెడ్ వద్ద మొబైల్ ఫోన్ దొరకగా, దానిని బాధ్యతతో చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర రెడ్డికి అప్పగించాడు. అధికారుల సమక్షంలో ఐఫోన్‌ను కిరణ్ కుమారికి అప్పగించారు. తనకు దొరికిన మొబైల్ ఫోన్‌ను నిజాయితీతో స్టేషన్‌కు అందజేసిన శ్రీరాములును చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి అభినందించారు.



సెల్‌ఫోన్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న పోలీసులు

రైల్వే ట్రాక్షన్ అప్‌గ్రేడ్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

గుంతకల్లు-కడప మధ్య భూసేకరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే ట్రాక్షన్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రైల్వే చట్టంలోని 1989లోని సెక్షన్ 2 (37ఎ) ప్రకారం విద్యుత్ ట్రాక్షన్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ పనులను ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటిస్తూ కేంద్రం అధికారిక నోటిఫికేషన్ ఈ నెల 24వ తేదీన జారీ అయినట్లు ప్రాజెక్టు అధికారి అమిత్ అగర్వాల్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద దేశ వ్యాప్తంగా 3000 మెట్రిక్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని సాధించాలన్న దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ముద్దనూరు- కడప మధ్య భూసేకరణ చేపట్టనున్నారు. ఈ భూసేకరణ ప్రజాప్రయోజనం కోసం, జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జరుగుతుందని ప్రాజెక్టు అధికారి తెలిపారు.

‘క్వారీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నాం’

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి పక్కనే కంకరకు సంబంధించిన మైన్స్‌లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ కారణంగా చాల రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కరించాలని గోవిందంపల్లె గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ యామినిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందంపల్లె గ్రామస్తులు మాట్లాడుతూ చాల సంవత్సరాలుగా గ్రామానికి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా కంకర క్వారీలో పెద్ద ఎత్తున పనులు నిర్వహిస్తుండటంతో.. మైన్స్‌లో భారీ పేలుళ్ల వల్ల వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అనేక మంది రోగాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలో పనులు నిర్వహిస్తున్నరని, కాలుష్య నివారణ కోసం ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అంతే కాకుండా జాతీయ రహదారి పక్కనే పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారని, దీంతో భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని రైతులు ఆన్‌లైన్‌కు సంబంధించి భూముల సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వర్‌రావు, ఆర్ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామ ప్రజలు

ఆటో బోల్తా.. యువకుడి మృతి

మదనపల్లె రూరల్ : ఆటో బోల్తా పడి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని వాల్మీకి వీధికి చెందిన నరసయ్య, రెడ్డెమ్మ దంపతుల రెండో కుమారుడు కృష్ణభగవాన్ (27) టైల్స్ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండే వాడు. ఆయన స్నేహితులైన బాబు, విజయ్‌తో కలిసి ఆటోలో బైపాస్‌రోడ్డు మీదుగా పట్టణంలోకి వస్తుండగా, అరేబియా హోటల్ సమీపంలో వేగాన్ని అదుపుచేయలేక ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణభగవాన్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు.



కృష్ణభగవాన్ (ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం చౌడసముద్రంకు చెందిన రమణ(60) తనకు పరిచయస్తుడైన మదనపల్లె మండలం పోతబోలుకు చెందిన నరసింహులుతో కలిసి చౌడసముద్రం నుంచి పాపిరెడ్డిపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని చెట్లవారిపల్లె వద్ద ట్రాక్టర్ పక్క నుంచి ఉన్నట్లుండి రోడ్డుపైకి రావడంతో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

- నిమ్మనపల్లె మండలం ఎగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన ఫిరోజ్, అతడి భార్య రాజమ్మ(45) ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో సోమలకు వెళుతుండగా, మార్గమధ్యంలోని కందూరు సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో రాజమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.
- కడప జిల్లా ఖాజీపేటకు చెందిన శంకరనాయక్ (24), కామాక్షయ్య(35) అరటికాయలు అన్‌లోడ్ చేసేందుకు కూలీ పనుల్లో భాగంగా పులివెందుల నుంచి బొలేరో వాహనంలో పలమనేరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని కురబలకోట మండలం ముదివేడు సమీపంలో బొలేరో ముందు చక్రం పంక్చర్ కావడంతో వాహనం అదుపుతప్పింది. దీంతో పైన ఉన్న ఇద్దరు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రిష్ణప్రసాద్



గాయపడిన వెటర్నరీ ఉద్యోగి నాగేంద్రప్రసాద్

జింక అడ్డు రావడంతో..

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో వెటర్నరీ ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ములకలచెరువు మండలంలో జరిగింది. కందుకూరు వెటర్నరీ కేంద్రంలో ఎల్ఎస్ఏగా పని చేస్తున్న నాగేంద్రప్రసాద్(47) సోమవారం సమావేశం నిమిత్తం కందుకూరు నుంచి బురకాయలకోటకు వెళుతుండగా, మార్గమధ్యంలోని దూలంవారిపల్లె సమీపంలో రోడ్డుకు అడ్డంగా జింక రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో కాలు విరిగింది. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

డిప్యూటీ ఎండీవోకు..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి సచివాలయంలో పని చేసే డిప్యూటీ ఎండీవో క్రిష్ణప్రసాద్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ నెల 27న ఆయన విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంలో సత్యసాయి జిల్లా పెనుగొండకు వెళుతుండగా సోమందేపల్లి వద్ద కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో కర్నూల్ ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నట్లు మండల పరిషత్ సిబ్బంది సోమవారం తెలిపారు. విషయం తెలుసుకున్న బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి కర్నూల్‌లోని అదే ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌గా పని చేస్తున్న తన బావమరిదికి ఫోన్ చేసి అధికారి క్రిష్ణప్రసాద్ ఆరోగ్యం కుదుట పడేందుకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు.